# ఓట్లు మావే.. గెలుపు మనదే..!

**చేవెళ్ల ఎన్నికలో బీసీల నినాదం ఇదేనంటున్న బీసీ సంఘాలు**

**వెనుకబడిన వర్గంగా ముద్రను చెరిపేసుకుందామని పిలుపునిస్తున్న నేతలు**



బీసీలు చైతన్యం చాటే సమయం ఆసన్నమైందని బీసీ సంఘాలు పేర్కొంటున్నాయి. ఓట్లు మావే.. గెలుపు మనదే.. నినాదంతో చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో ముందుకు సాగుదామని నేతలు పిలుపునిస్తున్నారు. వెనుకబడిన వర్గంగా ముద్ర వేసుకుని రాజకీయంగా వెనుకబడిపోవద్దని సూచిస్తున్నారు. రాజ్యాధికారం ఉంటేనే సబ్బండ వర్గాల ఆశలు, ఆశయాలు నెరవేరుతాయని వారు వివరిస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో బీసీలకు ఎదురైన కష్టాలు, నష్టాలను కండ్లారా జూశామని.. బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా నిలబడాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీలకతీతంగా ఓట్లు వేసి గెలిపించుకుందామని చెబుతున్నారు. బీసీల శక్తి, చైతన్యం అంటే ఎట్లుంటదో రుజువు చేసేందుకు 'కాసాని' రూపంలో వచ్చిన అవకాశాన్ని బీసీలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

- రంగారెడ్డి, మే 2(నమస్తే తెలంగాణ)

### బీసీలను ఏకం చేసిన నాయకుడు కాసాని



రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సమస్యలపై పోరాటం చేసిన ఘనత కాసాని జ్ఞానేశ్వర్‌కు దక్కుతుంది. అలాంటి నాయకుడిని గుర్తించిన కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం గొప్ప పరిణామం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే. బీసీ అభ్యర్థికి మద్దతుగా నిలుస్తాం.

– ప్రమోద్, బిల్‌కల్, మర్పల్లి

### బీసీలపై అభిమానాన్ని చాటుకున్న కేసీఆర్



బడుగు బలహీన వర్గాలను అణగదొక్కేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉన్నది. బీసీల గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. ఎన్నికల్లో వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉన్నది. కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి బీఆర్‌ఎస్ టికెట్ ఇచ్చి ఆ వర్గాలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

– అంజయ్యగౌడ్, రావులపల్లి, మర్పల్లి

### కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



బీఆర్‌ఎస్ అభ్యర్థి, బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు ఎంపీ ఎన్నికల్లో కేసీఆర్ 50 శాతం సీట్లు కేటాయించడం సంతోషకరం. కాంగ్రెస్, బీజేపీలు బీసీలను చిన్నచూపు చూస్తున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై మంచి అనుభవం ఉన్న కాసానిని చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది.

– నక్క శ్రీనివాస్‌గౌడ్, బీసీనేత, షాబాద్

### బీసీల సత్తా ఏంటో చూపెట్టాలి



చేవెళ్ల గడ్డపై బీసీల సత్తా ఏంటో చూపెట్టాలి. గత 40 ఏండ్లుగా బీసీల సమస్యలపై పోరాటం చేస్తూ, 96 కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన ఘనత కాసాని జ్ఞానేశ్వర్‌కే దక్కుతుంది. అలాంటి నాయకుడిని చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 50 శాతం మంది బీసీ ఓటర్లే ఉన్నారు.

– గాదం సత్తయ్య, బీసీ నాయకుడు, షాబాద్

### కాసానికే మా ఓటు



బడుగు వర్గాల నేత, మాజీ సీఎం బలపర్చిన కాసాని జ్ఞానేశ్వర్ గారికే మా ఓటు. ఈ ప్రాంత ప్రజల బాగోగులు తెలిసిన నేత, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గెలవడం ఖాయం. గతంలో ఈ పార్టీపై గెలిచిన నేత మరో పార్టీకి వెళ్లడం దురదృష్టకరం. ఆయన రాజకీయానికి నూకలు చెల్లినట్టే.. మాజీ సీఎం కేసీఆర్‌కు ఉన్న పట్టుదల మన రాష్ట్ర అభివృద్ధిలో ఎవ్వరికీ లేదు.

– రంగారెడ్డి, ప్రేమావతిపేట, రాజేంద్రనగర్ నియోజకవర్గం

### మళ్లీ బీఆర్‌ఎస్ రావాలి



తెలంగాణ బాధలు తీరాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ రావాలి. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలుస్తారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ హామీలూ సక్రమంగా అమలులో లేవు, ప్రస్తుతం అంతా గడ్డు కాలం వచ్చేసింది. సీఎం రేవంత్‌రెడ్డికి పాలించే సత్తా లేదు, ఓట్ల కోసం ఆయన ఊర్లలో మాయమాటలు చెబుతున్నారు. అయినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు.

– దస్తగిరి, గుత్తేదార్, శాస్త్రీపురం, రాజేంద్రనగర్ నియోజకవర్గం

### బీసీలు ఏకతాటిపైకి వచ్చి.. కాసానిని గెలిపించుకుందాం



ఈ ఎలక్షన్‌లో బీఆర్‌ఎస్ బలపరచిన బీసీల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీ అందించి బీసీల సత్తా చాటుతాం. బీసీలు ఏకం కావాల్సిన సమయం వచ్చింది. బీసీ అభ్యర్థిని గెలిపించుకుంటేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. బీసీలు ఏకమై అగ్రవర్ణాల రాజకీయ నాయకులను గతంలో గెలిపించుకుంటే వారి వల్ల బీసీలకు ఎలాంటి లాభం జరుగలేదు.

– మల్లేశం, మాజీ సర్పంచ్, హాజీపూర్, యాలాల మండలం

### బీసీల ఐక్యత చూపించాల్సిన సమయం ఆసన్నమైంది



తెలంగాణవ్యాప్తంగా 6 సీట్లలో బీసీలకు బీఆర్‌ఎస్ అవకాశం కల్పించింది. పార్టీలకతీతంగా బీసీలందరూ ఏకమై చేవెళ్లలో గెలుపు బావుటా ఎగురవేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్లమెంటుకు పంపుదాం. కాసానిని గెలిపించుకుంటేనే బీసీల్లోని అన్ని కులాలకు సముచిత న్యాయం జరుగుతుంది. బీసీల సత్తా చూపిస్తాం. చేవెళ్ల గడ్డపై బీసీల ఐక్యత చాటుతాం.

– తిరుపతి ముదిరాజ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, యాలాల మండలం

### ఎంపీ ఎన్నికల్లో కాసానికి పట్టం



బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కు పట్టం కడుతాం. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందాయి. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు కనీసం రైతు బంధును కూడా వేయలేకపోతున్నది. రైతులకు అన్ని విధాలుగా లాభం చేకూర్చే బీఆర్‌ఎస్ పార్టీకే మా మద్దతు ఉంటుంది. కాసానిని ఎంపీగా గెలిపించుకుంటాం.

– బుచ్చయ్య, జేఏసీ కో కన్వీనర్, కులకచర్ల మండలం

### బీఆర్‌ఎస్‌తోనే దళితులకు న్యాయం



బీఆర్‌ఎస్‌తోనే దళితులకు న్యాయం జరుగుతుంది. దళితులకు అన్ని విధాలుగా లాభం చేకూర్చేందుకు గత ప్రభుత్వం రైతు బంధు, దళిత బంధు వంటి మంచి పథకాలను ప్రవేశపెట్టింది. కాని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతు బంధు, దళిత బంధు రెండు కూడా బంధు అయ్యాయి. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ తరపున పోటీచేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కు పట్టం కడుతాం.

– వెంకటయ్య, దళిత యువశక్తి యువజన సంఘం మాజీ అధక్షుడు, కులకచర్ల

### బీసీలు ఓట్లు కాసే చెట్లు కాకూడదు



బీసీలు ఓట్లు కాసే చెట్లు కాకూడదు. మన ఓట్లు మనమే వేసుకుందాం. చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించుకుందాం. బీసీ ఉద్యమ నేతకు బాసటగా నిలబడుదాం. బడుగు బలహీన వర్గాలను ఏకం చేద్దాం. పార్లమెంట్‌లో బడుగుల గళం వినిపించాలంటే కాసానిని గెలిపించుకుందాం. బీసీలకు అవకాశాలు రావడం అరుదు.

– జమాల్పూర్, ఆరె కటిక సంఘం రాష్ట్ర సలహాదారు

### కాసాని గెలుపునకు కృషి చేద్దాం



చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రతి బీసీ ఇంటి గడప తడుదాం. ఓటర్‌కు దండం పెట్టి బీసీకి ఓట్లు వేద్దామని కంకణబద్ధులమై పనిచేద్దాం. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందాం. కాంగ్రెస్, బీజేపీలు బీసీలను విస్మరించారు. వారికి బుద్ధి చెప్పాలంటే కాసానిని గెలిపించుకోవడం ముఖ్యం. అందరం ఒక్కటై చేవెళ్ల పార్లమెంట్ నుంచి బీసీ రాజ్యాధికార బావుటా ఎగురవేద్దాం.

– జహంగీర్‌జీ, ఆరె కటిక సంఘం ఉపాధ్యక్షుడు

### బీసీల గొంతుక పార్లమెంట్‌లో వినిపిద్దాం



బీసీల పక్షాన పోరాడే నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి, పార్లమెంట్‌లో బీసీల గొంతుకను వినిపిద్దాం. స్వార్థ రాజకీయాలతో తమ ప్రయోజనాలను చూసుకునే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు బుద్ధి చెప్పేలా అన్ని వర్గాల ప్రజలు ఏకమై బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి. కాసాని గెలుపుతో బీసీల ప్రాధాన్యత పెరుగుతుంది.

– ఉప్పటూరి మధుకుమార్, చందానగర్

### కాసాని గెలుపు ఖాయం



బూటకపు హామీలతో గెలిచిన కాంగ్రెస్‌ను ఖతం పట్టించేందుకు అన్ని వర్గాల ప్రజలు ఒక్కటవ్వాలి. బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థుల గెలుపు ఖాయం. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఏండ్లుగా పోరాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం. కేసీఆర్‌కు కానుకగా అందిద్దాం.

– కోటా సతీష్, చందానగర్



## ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చర్యలు

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, మే 2 (నమస్తే తెలంగాణ) : పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకున్నామని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గ పార్లమెంటు ఎన్నికల విధి నిర్వహణలో నిమగ్నమైన అధికారులు, పోలింగ్ సిబ్బంది ఫామ్-12 ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గానికి సంబంధించి సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి అత్తాపూర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో, శేరిలింగంపల్లి నియోజకవర్గానికి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో, చేవెళ్ల నియోజకవర్గానికి చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో, పరిగి నియోజకవర్గానికి పరిగిలోని నం.1 బాలుర ఉన్నత పాఠశాలలో, వికారాబాద్ నియోజకవర్గానికి వికారాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, తాండూరు నియోజకవర్గానికి తాండూరు సాయిపూర్‌లోని నం.1 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంబంధిత ఏఆర్‌ఓలు ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటీ సెంటర్లలో ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో 23 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును ఈ ఓటర్ ఫెసిలిటీ సెంటర్స్ ద్వారా వినియోగించుకోనున్నారని తెలిపారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో 142 మంది పోలింగ్‌రోజు అత్యవసర విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఫామ్-12 డి ద్వారా ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ ఓటర్ ఫెసిలిటీ సెంటర్లలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని కలెక్టర్ తెలిపారు.

**బ్యాలెట్ యూనిట్లను**

## ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించాలి

**వికారాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి**



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 2 : మొదటి స్థాయి తనిఖీ పూర్తి అయిన బ్యాలెట్ యూనిట్లను ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు కేటాయించనున్నట్లు వికారాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గిడ్డంగిలో బ్యాలెట్ యూనిట్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ ర్యాండమైజేషన్ గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు పోలింగ్ అవసరాల మేరకు ఎన్నికల సంఘం జిల్లాకు అదనంగా 2 వేల బ్యాలెట్ యూనిట్‌లను కేటాయించిందన్నారు. బ్యాలెట్ యూనిట్లను మొదటిస్థాయి తనిఖీ చేసిన అనంతరం ర్యాండమైజేషన్ ద్వారా అసెంబ్లీ నియోజకవర్గాలకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఈడీఎం మహమూద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలి

**కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం**

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**



శంకర్‌పల్లిలో పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్, మే 2 : ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం శంకర్‌పల్లిలో పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. 70 ఏండ్ల కాలంలో ఏ ప్రభుత్వాలూ, ముఖ్యమంత్రులూ చేపట్టని అభివృద్ధి, సంక్షేమం కేసీఆర్ చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో చేవెళ్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు స్పష్టం చేశారు. గత నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలందరూ మళ్లీ కేసీఆరే కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలకు ప్రతి గడపగడపకూ వివరించాలని సూచించారు. చేవెళ్ల గడ్డపై బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా అందజేద్దామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

# ఆదరణ చూసి ఓర్వలేకనే ఆంక్షలు

- ఎన్ని ఆంక్షలు విధించినా ప్రజలంతా కేసీఆర్ వైపే..
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- విలేకరుల సమావేశంలో ఎంపీ ఎన్నికల ఇన్‌చార్జి బాల్‌రాజ్‌యాదవ్



షాద్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ ఎన్నికల ఇన్‌చార్జి బాల్‌రాజ్‌యాదవ్

షాద్‌నగర్, మే 2 : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బడేబాయ్, చోటేబాయ్ కలిసి ఎన్నికల ఆంక్షల పేరుతో ఆయన ప్రచారాన్ని అడ్డుకుంటున్నారని ఎంపీ ఎన్నికల షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దూదిమెట్ల బాల్‌రాజ్‌యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం షాద్‌నగర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేసీఆర్ రోడ్‌షోలకు ఎన్ని ఆంక్షలు విధించినా ప్రజలంతా ఆయన వైపే ఉన్నారని.. అక్కడికి వస్తున్న లక్షల మందిని చూస్తేనే తెలుస్తున్నదన్నారు. పీసీసీ హోదాలో వీడియోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోకుండా.. ఎన్నికల్లో ఎక్కడ ఓడిపోతామో అన్న భయంతో కేంద్రంలోని బడేబాయ్‌తో కలిసి చోటేబాయ్ కుట్ర పన్ని కేసీఆర్ రోడ్‌షోలను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఎలా ప్రచారం చేయాలో తెలియక కేసీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నదని ఆరోపించారు. అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని.. గ్రామాల్లో ప్రచారం చేస్తున్న ఆ పార్టీ నాయకులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుంటే.. బీజేపీ కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్నదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఓటుకు నోటు కేసు వేళ్లాడుతున్నదని.. ఆ కేసు నుంచి తప్పించుకునేందుకు ఆయన ప్రధాని మోదీతో దోస్తీ చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఎప్పుడూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని.. అప్పటి ఆంధ్ర నాయకులతో కలిసి ఉద్యమకారులపై తుపాకీని ఎక్కుపెట్టారని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్‌లు రిజర్వేషన్లపై చేస్తున్న రాజకీయాలను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి రెండు జాతీయ పార్టీలు చేసిందేమీలేదన్నారు. రాష్ట్రాభివృద్ధి బీఆర్‌ఎస్ చీఫ్ కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. అందువల్ల మహబూబ్‌నగర్ ఎంపీగా మరోసారి కేసీఆర్ బలపర్చిన మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులకు సూచించారు. మన్నె శ్రీనివాస్‌రెడ్డి కరోనా సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని.. ఎంపీ నిధులతో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేశారని గుర్తు చేశారు. సీమాంధ్రులకు హారతులు పట్టిన బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు ప్రజలు ఓటు వేయరని.. పాలమూరును పట్టించుకోని సీఎం రేవంత్‌రెడ్డి, చల్లా వంశీచంద్‌రెడ్డిలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న ప్రచారానికి అన్ని ప్రాంతాల్లోనూ అపూర్వ స్పందన వస్తున్నదని.. ఆయన మరోసారి ఘన విజయం సాధిస్తారని తెలిపారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబల్‌నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## రేపటి నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్

పరిగి, మే 2 : పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సిబ్బంది, ఇతర అత్యవసర సేవల ఉద్యోగులు ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని వికారాబాద్ ఆర్డీవో, ఏఆర్వో వాసుచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో ఎన్నికల సిబ్బంది పోలింగ్ ఆఫీసర్లు, ఏపీవోలు, ఓపీవోలు, 6న ఆర్టీసీ, రైల్వే, బీఎస్‌ఎన్‌ఎల్, విద్యుత్ ఉద్యోగులు, 7, 8 తేదీల్లో పోలీసు శాఖ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. పరిగిలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర నం.2లో ఏర్పాటుచేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో సంబంధిత రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయవచ్చని చెప్పారు. ఈ నెల 5, 6 తేదీల్లో 85 ఏండ్లు పైబడినవారు, పీడబ్ల్యూడీ ఓటర్లు ఇంటి దగ్గరే ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వారు తెలిపారు.

## ఓటర్ సమాచార స్లిప్‌లు ప్రతి ఇంటికి చేరేలా చూడాలి

వికారాబాద్, మే 2 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఓటర్ సమాచార స్లిప్‌లు 100 శాతం ప్రతి ఇంటికి చేరేలా చూడాలని, ఓటర్ స్పెషాలిటేషన్ సెంటర్‌లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. మిషన్ భగీరథ వాటర్ ప్రతిరోజూ వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని, బోర్‌వెల్స్, పంపుసెట్లు ఎక్కడ కూడా రిపేరు లేకుండా చూడాలన్నారు. వాటర్ రావడంలేదనే సమస్య రాకూడదన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున గ్రామాల్లో ఎక్కడ కూడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. మిషన్ భగీరథ వాటర్ సరఫరాలో సమస్య ఏర్పడితే వెంటనే అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో జాప్యం జరుగకుండా లేబర్ సమీకరణ చేస్తూ లక్ష్యం మేరకు అంచనా ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ప్రతి రోజూ లేబర్ సమీకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎంపీడీవోలు, ఎంపీవోలు ప్రతి రోజూ తమ పరిధిలో ఉన్న గ్రామాలను పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లే రోడ్డు పనులను రైతులతో సమన్వయపరుచుకొని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. భూమి చదును చేయడం, పొలాలకు వెళ్లే దారులను క్లియర్ చేసి మట్టి రోడ్డు వేయడం, ముండ్ల పొదలు తొలగించడం, గ్రామ పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, వీధి లైట్లు, నర్సరీ, హరితాహారం తదితర సమస్యలపై సమావేశాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించేలా ముందుకుకెళ్లాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. లేబర్ మొబిలైజేషన్ తక్కువగా ఉన్న గ్రామాలపై దృష్టి సారించాలని., పూర్తి చేసిన పనులన్నింటికీ ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కొంత మేర గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని , ఇంకా కొన్ని గ్రామాల్లో పనులు జరగాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాలవారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీవో జయసుధ, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 50 కోట్ల మందిని గమ్యస్థానాలకు చేర్చి..

**హైదరాబాద్ మెట్రో.. మరో మైలురాయి**

సిటీబ్యూరో, మే 2 (నమస్తే తెలంగాణ) : అనతికాలంలోనే అనూహ్యమైన ఆదరణ పొందిన హైదరాబాద్ మెట్రో.. మరో మైలురాయిని చేరుకున్నది. ఏకంగా ఇప్పటివరకు 50 కోట్ల మందిని గమ్యస్థానాలకు చేర్చి.. చరిత్రను లిఖించుకున్నది. దేశంలోనే మూడో అతి పొడవైన మెట్రో వ్యవస్థగా గుర్తింపు పొందిన హెచ్‌ఎంఆర్‌ఎల్.. నగరవాసుల మనస్సును చూరగొంటున్నది. అన్ని మార్గాలు అందుబాటులోకి వచ్చిన అనతి కాలంలోనే మెట్రోకు అనూహ్యమైన స్పందన లభించింది. మియాపూర్-అమీర్‌పేట మార్గంలో 11 కిలోమీటర్ల మెట్రో రైలు సేవలను 2017లో తీసుకురాగా, అప్పటి నుంచి దశలవారీగా సర్వీసులను పెంచుతున్నారు. ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోల్-రాయదుర్గ్ మార్గాల్లో దాదాపు 68 కిలోమీటర్ల పొడవైన లైన్లు అందుబాటులోకి తెచ్చారు. ఈ క్రమంలోనే సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా హెచ్‌ఎంఆర్‌ఎల్ సంస్కరణలను అమలు చేయడంతో మెట్రో రైలు వినియోగానికి ప్రయాణికులు మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ఉన్న రాయదుర్గ్ వరకు ప్రయాణించే వెసులుబాటు ఉండటంతో ఐటీ ఉద్యోగులు చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. నగరంలో నిత్యం 4-5 లక్షల మంది ప్రయాణికులు మెట్రో సేవలను పొందుతుండగా, 2017 నుంచి ఇప్పటివరకు (2024 మే 1 నాటికి) 50 కోట్ల మంది మెట్రోలో ప్రయాణించడంతో హెచ్‌ఎంఆర్‌ఎల్ మరో మైలురాయిని అధిగమించినట్లైంది. గతేడాది జూలైలో ఒక్క రోజులో 5.1 లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చడం విశేషం.

## కాంగ్రెస్‌ను వీడి కారెక్కిన మాజీ ఉప సర్పంచ్

**ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో చేరికలు**

**పది రోజులు సైనికుల్లా పనిచేయాలని పిలుపు**



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట, మే 2 : కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక గులాబీ గూటికి వస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం మండలం గట్టుపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్‌తో పాటు మరికొంత మంది గురువారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మడం లేదన్నారు. నాలుగు నెలల కాలంలో ఏ ఒక్క హామీనీ నెరవేర్చకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని వీడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలకు విశ్వాసం లేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలు ఇప్పుడు అమలు కావడం లేదని గ్రామీణ ప్రాంతాల ప్రజలు మండిపడుతున్నారన్నారు. చాలా మందికి రైతు బంధు పడలేదు, రైతు రుణ మాఫీ చేయలేదన్నారు. వేసవి కాలంలో కనీసం నీటి సమస్యను పరిష్కరించలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉండగానే మిషన్ భగీరథ ట్యాంక్‌లు, పైపులైన్లు వేసి రూపాయికే నాల్లా కనెక్షన్ ఇచ్చినట్లు తెలిపారు. ఉన్న వనరులను ఎలా వాడుకోవాలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియడం లేదన్నారు. ప్రజలందరూ తిరిగి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. చేవెళ్ల పార్లమెంటు ఎన్నికలో కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పది రోజుల పాటు ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం మండల అధ్యక్షుడు రాజూనాయక్, మండల యూత్ అధ్యక్షుడు శ్రీను, గ్రామ శాఖ అధ్యక్షుడు శంకరయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి

**వికారాబాద్ అదనపు కలెక్టర్, సహాయ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ**



బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, మే 2 : ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు పనిచేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్, సహాయ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ తెలిపారు. గురువారం వికారాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 3 నుంచి హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సెక్టోరల్, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్, బూత్ స్థాయి అధికారులు, తహసీల్దార్ల ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సాజిదా బేగం, వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## రేపటి వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు పొడిగింపు

**వికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్**



వికారాబాద్, మే 2 : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించే తేదీని ఈ నెల 4 వరకు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించిందని వికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రుల వినతి మేరకు ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుందన్నారు. విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించడానికి, అదేవిధంగా ప్రిన్సిపాళ్లు తమ కళాశాల ద్వారా ఆన్‌లైన్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించడానికి కూడా ఈ నెల 4 చివరి తేదీ అని.. ఇప్పటివరకు పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు తమ ఫీజును సంబంధిత కళాశాలలో చెల్లించాలన్నారు.